కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న హరీశ్‌రావు

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 16: బీఆర్‌ఎస్‌లో పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ పార్టీలో సభ్యత్వం పొందిన కార్యకర్తలు ప్రమాదవశాత్తు చనిపోతే పార్టీ తరఫున ఇన్సూరెన్స్ చేసి రూ.2 లక్షల ప్రమాద బీమా ఇస్తామని చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గంలో 57మంది కార్యకర్తల కుటుంబాలకు రూ. కోటి 14 లక్షలు అందించామన్నారు. ఇటీవల నారాయణరావుపేటకు చెందిన మండేపల్లి రాజు, సిద్దిపేట పట్టణం భారత్‌నగర్‌కు చెందిన బొజ్జ లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున బీమా చెక్కులను హరీశ్‌రావు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాచగిరి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

వర్గల్, మార్చి 16: నాచగిరి బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీమంత్రి హరీశ్‌రావుకు ఆలయ ఈవో ఆహ్వాన పత్రికను ఆదివారం అందజేశారు. ఈనెల 19 నుంచి జరగనున్న నాచగిరి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, యాదవరెడ్డి, ప్రతాపరెడ్డి, నర్సారెడ్డిలకు ఆలయ ఈవో విశ్వనాథ శర్మ ఆహ్వాన పత్రికను అందచేశారు. కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ఈవో విశ్వనాథ శర్మ

పలు కుటుంబాలకు పరామర్శ

రాజేశంగౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు మార్చి 16: చిన్నకోడూరు మండలంలో పలు కుటుంబాలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆదివారం పరామర్శించి ఓదార్చారు. అల్లీపూర్ గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు రాజేశం గౌడ్ భార్య, మాజీ సర్పంచ్ అనసూయ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని హరీశ్‌రావు పరామర్శించారు. మండలకేంద్రంలోని ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గన్‌మెన్ గణేశ్, హమాలీ సంఘం అధ్యక్షుడు మల్లేశం ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను, డారం గాడిచెర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ రేషన్ డీలర్ రాజేశం తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీమంత్రి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పలువురికి పరామర్శ

సిద్దిపేట కమాన్, మార్చి 16: సిద్దిపేట పట్టణానికి చెందిన వ్యాపార వేత్త గట్టు రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సిద్దిపేటకు చెందిన మార్క రాందాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. హరీశ్‌రావు వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు రాధాకృష్ణశర్మ తదితరులు ఉన్నారు.

పెద్దమ్మ ఉత్సవాలకు రండి...

హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

సిద్దిపేట కమాన్, మార్చి 16 : సిద్దిపేట పట్టణంలో జరగనున్న పెద్దమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 24 వరకు పెద్దమ్మ ఆలయ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

నేడు పశువుల అంగడి వేలం

హుస్నాబాద్‌టౌన్, మార్చి 16: హుస్నాబాద్‌లో సోమవారం పశువుల అంగడి వేలం నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో ఈ వేలం పాట నిర్వహించనున్నారు. 11 మంది వేలం పాటలో పాల్గొనేందుకు డిపాజిట్లు చెల్లించారు. గతేడాది రూ.కోటి 20 లక్షల 20 వేలకు అంగడిని కరీంనగర్ జిల్లాకు చెందిన వ్యక్తి దక్కించుకున్నారు. ఈ ఏడాది అంతకంటే ఎక్కువగా వేలం పాటను నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. హుస్నాబాద్ చుట్టూ కొత్తగా అంగళ్లు ప్రారంభం కావడంతో ఇక్కడ ఆదాయం తగ్గుతుందని, హుస్నాబాద్ అంగడి వేలం కూడా తగ్గించాలని డిమాండ్‌ను కాంట్రాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. మరి అధికారులు వేలం పాట విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే.

హరితసేన కోఆర్డినేటర్‌గా మహిపాల్

హరిత రక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న హరితసేన నాయకులు

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 16: గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోశ్‌కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర కోఆర్డినేటర్ గారిపల్లి సతీశ్ ఆధ్వర్యంలో ఆదివారం కొండపాక మండల హరితసేన కార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా కొండపాక మండల హరితసేన కో ఆర్డినేటర్‌గా కాశిరెడ్డి మహిపాల్‌రెడ్డి, వైస్ కోఆర్డినేటర్‌గా దోమల దుర్గాప్రసాద్ యాదవ్ నియమితులయ్యారు. అనంతరం హరిత రక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు, గజ్వేల్ నియోజవర్గ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు అంబటి బాలచందర్ గౌడ్, హరిత సేన నాయకులు మదన్, రమేశ్, వినోద్ పాల్గొన్నారు.

హరితసేన గజ్వేల్ ఇన్‌చార్జిగా అనిల్ మొగిలి

మర్కూక్, మార్చి 16: గజ్వేల్ హరితసేన ఇన్‌చార్జిగా అలిరాజపేటకు చెందిన సినీ హీరో అనిల్ మొగిలిని నియమించినట్లు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సిద్దిపేట ఇన్‌చార్జి చెప్యాల రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం రాజ్యసభ మాజీ సభ్యుడు జోగిపల్లి సంతోశ్‌రావు చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా కమిటీని ఎన్నుకున్నాకు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సిద్దిపేట ఇన్‌చార్జి చెప్యాల రాజేశ్వరరావు, స్టేట్ కోఆర్డినేటర్ గరిపెల్లి సతీశ్, ప్రొఫెసర్ శ్రీనివాస్ విష్ణు ఆధ్వర్యంలో మర్కూక్ మండలంలోని అంగడికిష్టాపూర్‌లో గజ్వేల్ నియోజకవర్గ కమిటీని నియమించారు. నియోజకవర్గ హరితసేన ఇన్‌చార్జిగా అనిల్ మొగిలి, మండలాల కోఆర్డినేటర్లుగా కార్తిక్, తీగుల్ల బాలకృష్ణ, జయమ్మ, భాస్కర్, రమేశ్, ప్రవీణ్, ప్రవీణ్‌రెడ్డి, బూడిద రమేశ్‌గౌడ్, ప్రసాద్‌లను నియమించినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో హరితసేన పని చేస్తుందని తెలిపారు.

మర్కూక్: అంగడికిష్టాపూర్‌లో మొక్క నాటుతున్న హరితసేన కమిటీ సభ్యులు

మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తాం

దుబ్బాకలో నిర్వహించిన జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

జాబ్‌మేళాలో పాల్గొన్న నిరుద్యోగ మహిళలు

- కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అందరినీ నిలువునా ముంచింది..
- మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి
- ప్రభుత్వం చేయలేని పని మేము చేస్తున్నాం
- మహిళలకు ఉపాధి కల్పించేందుకే జాబ్ మేళా
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 16: గ్రామీణ నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు జాబ్ మేళా నిర్వహించారు. హైదరాబాద్‌లోని కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు దుబ్బాక నియోజకవర్గంలోని నిరుద్యోగ మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 223 మంది మహిళలు దరఖాస్తు చేసుకొని, ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని నిరుద్యోగ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తమవంతుగా కృషి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసేందుకు ఆసక్తిగల మహిళలకు మంచి జీతంతోపాటు వసతి సౌకర్యం కంపెనీ కల్పిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో మహిళలను, నిరుద్యోగ యువతను, రైతులను నిలువునా ముంచిందన్నారు. చేతగానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేని పనులను ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్ చేస్తుందని తెలిపారు. మహిళా సంక్షేమంతోపాటు మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహాయ సహకారాలతో ఐటీ కంపెనీల్లో పని చేసేందుకు మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. డ్రోన్ కెమెరా ఆపరేటర్లుగా పనిచేసేందుకు త్వరలో దుబ్బాకలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరైన మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గజ్వేల్, మార్చి 16: మండల పరిధిలోని అక్కారంలో ఆదివారం పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ బాలచంద్రం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సహకారంతో వచ్చిన చెక్కులను అందజేశారు. మెతుకు శివకు రూ.1,05,000, మల్లమ్మకు రూ.60వేలు, యాదగిరికి రూ.33వేలు, పృథ్వీరాజ్‌కు రూ.28వేలు, లక్ష్మికి రూ. 13,500 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...

దుబ్బాక, మార్చి 16: దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని 105 మంది బాధితులకు రూ. 22లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. దుబ్బాక సొసైటీ చైర్మన్ కైలాష్, నాయకులు రాజమౌళి, ఎల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాలకిషన్‌గౌడ్, యాదగిరి, స్వామి, కృష్ణ, నరేశ్ పాల్గొన్నారు.

దుబ్బాకలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

గజ్వేల్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

కొమ్మూరిని పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 16: మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తల్లి సత్తెమ్మ ఇటీవల మృతిచెందింది. ఆదివారం మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సందర్శించి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తూంకుంట నర్సారెడ్డిలతో పాటు పలువురు నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోశ్‌కుమార్, చేర్యాల మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేక మల్లేశం, కొమ్ము రవి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కామిడి రమేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ముస్త్యాల నాగేశ్వరావు, అంజయ్య, సాగర్, కమలాకర్, మంగోలు చంటి, మానస పాల్గొన్నారు.

కమలాకర్‌ను సన్మానించిన పల్లా

కమలాకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 16: డాక్టరేట్ పొందిన కమలాకర్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు. మద్దూరు మండలంలోని రేబర్తికి చెందిన బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఓయూ జేఏసీ నేత జంగిటి కమలాకర్ చేంజింగ్ అర్బన్ గవర్నెన్స్ ఇన్ ఇండియా అనే అంశంలో పరిశోధన పూర్తి చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి శనివారం డాక్టరేట్ అందుకున్నారు. చేర్యాల పట్టణంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదివారం కలిశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా కమలాకర్‌ను అభినందించడంతో పాటు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మద్దూరు మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోల్ చంటి, జిల్లా నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, చేర్యాల టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, దాసు ఉన్నారు.

యువకులు డ్రగ్స్ బారినపడొద్దు

మాట్లాడుతున్న త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 16: యువకులు, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నాడు. కొండపాక మండలం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపల్లిలో సాంస్కృతి సారధి ఆధ్వర్యంలో శనివారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలన్నారు. సైబర్ నేరాలు జరుగుతుండడం వల్ల వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. పిల్లలకు ఫోన్ అలవాటును దూరం చేయాలని, మూఢనమ్మకాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మల్లేశం, విలేజ్ ఆఫీసర్ బొడిగె శ్రీహరి గౌడ్, సాంస్కృతిక కళాకారులు శ్యామ్, కనకయ్య, హరిప్రసాద్, భిక్షపతి, ప్రకాశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

ఖాజీపూర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మార్చి 16: పనుల్లో సదరు కాంట్రాక్టర్ నాణ్యతాప్రమాణాలు పాటించి నిర్మాణాలు చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి మాజీ ఎంపీపీ పంజాల కవితాశ్రీనివాస్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, నాయకులు చిరంజీవి, పర్శరాములు, నర్సయ్య, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

తొగుట, మార్చి 16 : నూతన వధూవరులను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఆశీర్వదించారు. తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఈదగళ్ల లక్ష్మీశంకర్ దంపతుల కుమారుడు శివకుమార్-మనీష, కాన్గల్ గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ముడికే కనకయ్య సొదరుడి కుమార్తె లాస్యశ్రీ (స్వప్న)-రాజ్ కుమార్‌ల వివాహలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, రాజిరెడ్డి, కొమురయ్య ఉన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

పొటి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, మార్చి 16: ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని వాసవి క్లబ్ అధ్యక్షుడు మురంశెట్టి కుమార్ అన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మంజుల, శివశంకర్, సత్యనారాయణ, ధనలక్ష్మి, మర్యాల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట, మార్చి 16: సిద్దిపేట పట్టణంలోని మోహిన్‌పుర వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో వికాస తరంగిణి వారి నేతృత్వంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవిలో 45 రోజుల పాటు అంబలి, మజ్జిగను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఐత పురుషోత్తం, బుక్క రాములు, డాక్టర్ విశ్వనాథం, చక్రపాణి, కొండా రమేశ్, తడిసిన రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి

రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

చేర్యాల, మార్చి 16: భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు సందడి చేశారు. 9వ వారం సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. స్వామివారి సన్నిధిలో మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు శనివారం ఉదయం నుంచే మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. ఆదివారం వేకువజామునే స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు అర్చన, ప్రత్యేక పూజలు, కేశఖండన, నజరు, మహామండప, చిలుక పట్నం, బోనం, టెంకాయలు, హుండీల్లో కానుకలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు గంగరేగు చెట్టు వద్ద ముడుపులు, సంతానం కలగాలని ఒల్లు బండ పూజలు, రాతిగీరల వద్ద మొక్కులు, కోడెను కట్టివేసి స్వామివారిని వేడుకున్నారు. భక్తులకు మల్లన్న ఆలయ పాలక మండలి సభ్యులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలందించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ నేతృత్వంలో చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

సిద్దిపేట టౌన్, మార్చి 16: ఉపాధ్యాయులు ఏ కోరికలు కోరకూడదని శాసనమండలిలో సీఎం రేవంత్‌రెడ్డి అనడం సరికాదని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేటలో నిర్వహించిన టీపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు ఏ హామీలు ప్రచారం చేసిందో అన్ని హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డిపై ఉందన్నారు. ప్రభుత్వం రాగానే అన్ని డీఏలు చెల్లిసామని, ఆరు నెలల్లో పీఆర్సీని అమలు చేస్తామని హామీలు ఇచ్చి ఇప్పటివరకు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఉపాధ్యాయులకు హక్కుగా రావాల్సిన డీఏలు, పీఆర్సీలను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీతో పెద్దఎతున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు విజయేందర్ రెడ్డి, నరేందర్, నరసింహ రెడ్డి, సత్యనారాయణ, శివాజీ, అజీజ్, రాంరెడ్డి, జానకిరాములు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

రేబర్తిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 16: బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని బీఆర్‌ఎస్ మండల నాయకుడు నల్ల బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మద్దూరు మండలంలోని రేబర్తిలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.5లక్షల ఉపాధిహామీ నిధులతో 1వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పల్లె ప్రగతితో గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అందె భూపతి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నలుసాని లింగారెడ్డి, సొసైటీ డైరెక్టర్ నలుసాని మోహన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు గవ్వల గణేశ్, బొద్దుల చంద్రమౌళి, బీఆర్‌ఎస్ నాయకులు నల్ల భూపతిరెడ్డి, కలకోటి నర్సిరెడ్డి, గీకురు మైసయ్య, ఇరుమల్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

దాబాలపై ఎక్సైజ్ దాడులు

9 మందిపై కేసు

తనిఖీల చేస్తున్న సీఐ, ఎస్సైలు

సిద్దిపేట టౌన్, మార్చి 16 : దాబాలపై సిద్దిపేట ఎక్సైజ్ పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు ఆర్‌ఎస్, చాముండి, మయూరి, గాయత్రీ, సాయిరామ్, దుర్గా, గ్రీన్ తదితర దాబాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి చట్టవిరుద్ధంగా మద్యం తాగుతున్న 9 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దాబాల్లో బహిరంగ ప్రదేశాల్లో, హోటళ్లలో, మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాబాల్లో మద్యం సిట్టింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఎస్సైలు విజయ్, కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

సిద్దిపేట టౌన్, మార్చి 16: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటినా కళాకారులను పట్టించుకున్న పాపాన పోలేదని తెలంగాణ కళాకారుల వేదిక వ్యవస్థాపకుడు కామల్ల ఐలన్న అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ కళాకారులను ఆదుకొని, తక్షణమే కళాకారుల వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే కల్చరల్ పాలసీని ప్రకటించి, అన్ని శాఖల్లో కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నర్సింహులు, గంగాధర్, రేణుక, దాసు, చిరంజీవులు, రాజు, ఎల్లం పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

గుర్జకుంట వాగులో ఇసుక లోడుతో ట్రాక్టర్

చేర్యాల, మార్చి 16: మండలంలోని గుర్జకుంట వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పరిసర గ్రామాల రైతులు కోరారు. నాలుగు రోజులుగా వాగు నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను ఎలాంటి అనుమతి లేకున్నా దర్జాగా చేర్యాల పట్టణంతోపాటు కొమురవెల్లి మండల కేంద్రానికి రవాణా చేస్తున్నారు. అసలే భూగర్భ జలాలు అడుగంటి తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న చేర్యాల ప్రాంతంలో వాగు నుంచి ఇసుకను రవాణా చేస్తుండడంతో వాగు పరిసర గ్రామాల రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులకు తెలపడంతో వాగు వద్దకు వెళ్లి విచారణ చేపట్టి అనుమతి లేకపోవడంతో ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి, వేకువజాము న ట్రాక్టర్ల యజమానులు అనుమతి లేకుండా ఇసుకను సమీపంలోని పట్టణాలు, మండల కేంద్రాలకు తరలిస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.